# రోగం

వసంత ఋతువులా సుందర సుమనోహరంగా ఉండే గీతిక శిశిరంలా వెలవెలపోతూ విలవిల్లాడుతోంది. రాగరంజితంగా సుస్వరాలు పల్లవించాల్సిన వీణ తీగ తెగి మూగవోయినట్టు మౌనముద్రలో ఉంది.

తన మైత్రీ బాంధవినలా నిర్లిప్తంగా చూస్తుంటే సుచరిత హృదయ తలంలోంచి సాగర కెరటాలు శిరసెత్తి హోరెత్తాయి.

"మేనబావంటే నాకెంతో ఇష్టం. ఆఫ్టాల్ క్లర్క్ అని బావని తిరస్కరించాడు మా నాన్న. అమెరికా సంబంధమని గొప్పలకు పోయి అత్యాశతో అతడితో... ఆ రోగిష్టి వాడితో... నాకు ముడివేసారు. పెళ్లికి ముందే ఉందిట ఆ మాయదారి రోగం. దాచిపెట్టారు. ఆ 'విష(యు)ం' నాకు చేరేలోగా జీవితం చేజారిపోయింది. " శోకదేవతలా ముడుచుకుపోయిన బాల్య మిత్రురాలి ఆవేదనకు చలించిపోయింది సుచరిత.

గీతిక వివాహమై ఏడాది దాటిందంతే!

ఆమె వైధవ్యంతో తిరిగొచ్చిందనే కబురు విని వాళ్ళింటికి పరుగెత్తుకొచ్చింది సుచరిత.

"సుచరీ! నువ్వయినా జాగ్రత్తపడు. తెగించయినా మ్యారేజ్‌కి ముందే మగాడి హెల్త్ వివరాలు సేకరించు. ఈ కాలానికీ ఆలోచన తప్పేం కాదు. ఏ రోగం లేదని నిర్ధారణయ్యాకే అతడిని వైవాహిక జీవితంలోకి ఆహ్వానించు." మిత్రురాలికి హితబోధ చేసింది గీతిక.

స్నేహితురాలి ఎదగాయాన్ని ఓదార్పు ఔషధంతో తడిమి తడిమి ఉపశమనం కలిగించిన సుచరిత తను ఆలోచనల్లో పడిపోయింది.

నిన్ననే ఓ మగాడు 'మొగుడు'గా ప్రమోట్ కావడానికి ఈ 'మగువ' కోసం 'పెళ్లిచూపులు' విసిరాడు అందరి సమక్షాన లైసెన్స్‌డ్‌గా.

చాలాసేపు గీతికతో గడిపిన సుచరిత విచారవదనంతో ఇంటికి బయల్దేరింది.

ఆ సాయంత్రం పేరెంట్స్ ని కూర్చోబెట్టి సుచరిత తన అంతరంగాన్ని ఆవిష్కరించింది. కూతురు మనోభావాలకు మొదట నివ్వెరబోయినా కంటిముందే గీతిక విషాద దృశ్యం కన్నీరై కదలాడుతుంటే సుచరిత ప్రతిపాదనను అంగీకరించక తప్పలేదు వారికి.

తమ కూతుర్ని చూసెళ్లిన అబ్బాయి తండ్రికి ఫోన్ చేసి హెల్త్ వివరాలు నిర్మొహమాటంగా అడిగాడు సుచరిత తండ్రి శోభనాచలపతి. పిల్లాడికి అస్థమా తప్ప హెల్దీగానే ఉన్నాడని దాచకుండా చెప్పాడాయన. సుచరితకు ముందే ఆ కుర్రాడు నచ్చలేదు. ఈ వంకతో వదులుకుందా సంబంధాన్ని.

మంచి క్యాష్ పార్టీ అని మరో ఇద్దరు కుర్రాళ్ళను వెతికిపెట్టాడు పెళ్ళిళ్ల పేరయ్య.

ఒకతడికి దొడ్డు దొడ్డు కళ్ళద్దాలున్నాయి. పుట్టబోయే సంతానానికి డిటోడిటోగా అద్దాలొస్తాయేమోనని వెరచి సుచరిత అతడిని నిరాకరించింది. మరొకతనికి మైనర్ నర్వ్స్ ప్రాబ్లమని తెలిసి ఎందుకొచ్చిన ఫ్యూచర్ గొడవని తిరస్కరించింది.

"ఇక ఈ జన్మకు నీకు పెళ్లవదు" శోభనాచలపతి చీవాట్లేసాడు.

"ఇదేం విడ్డూరమే?" అంటూ తల్లి మాలతి బుగ్గలు నొక్కుకుంది.

సుచరిత చెక్కు చెదరలేదు. మొండిపట్టు వీడలేదు.

పేరయ్యశాస్త్రి సీరియస్‌గా గాలించి గాలించి మరో సంబంధమొకటి దొరకబట్టాడు. కుర్రాడు హాండ్సమ్‌గా ఉన్నాడు. మంచి ఉద్యోగం ఉంది. ఆస్తికి కొదువలేదు. పైగా సుచరిత అనుకున్నట్లుగానే, ఆశించినట్లుగానే 'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే కాప్షన్‌కి మోడల్‌రోల్‌లా ఉన్నాడు.

ఇకనేం? ఆమె ఆనందానికి పట్టపగ్గాల్లేవు.

ఈడూజోడూ కుదిరిందని అమ్మ లక్కలన్నారు. గీతిక కూడా ఓకే చేసేసింది.

అలా రోహిత్‌తో సుచరిత పరిణయం రంగరంగ వైభవంగా జరిగింది!

కథ ఇక్కడే ఊహించని మలుపు తిరిగింది.

ఆనందంగా సంసార జీవితంలోకి అడుగిడిన సుచరితకు తొందర్లోనే ఓ చేదునిజం స్వానుభవంలోకి వచ్చింది.

ఆకాశంలోని నక్షత్రాలు ఒకేసారి రాలిపడి ఆమె కనుపాపల ఉపరితలాలపై భయాందోళనల్ని సృష్టించాయి. సుచరిత చిగురుటాకులా నిలువెల్లా వణికిపోయింది.

సముద్రగర్భాన్ని చీల్చుకొని ఉవ్వెత్తున పైకెగసిన ఓ భీకర కెరటం వేయి పాయలుగా చీలి సుచరిత గుండెగొంతుకను ఒడిసిపట్టినట్టు ఉలిక్కిపడింది.

వ్యాధి తగ్గడానికి మందులున్నాయి. నివారణకు మార్గాలున్నాయి. నిర్మూలనకు చికిత్సలున్నాయి. అయినా ఒక వ్యక్తి వ్యాధి బారిన పడడమనేది అతడి చేతుల్లో లేదు. తలరాత, విధివ్రాత అంతే.

కానీ పడతి శీలాన్ని అణువణువూ శంకించి... జీవితాంతం వెన్నంటి, వెంటాడి, వేటాడి, వేధించి వేధించి చంపుతుంది... నిత్యం ఆమె మనోశిఖరాన్ని చీల్చేస్తుంది... అదే అనుమానరోగం..!

పెళ్ళయ్యాక నాలుగోనాడు బంధువుల ఫంక్షన్ నుండి తిరిగొస్తుంటే రోహిత్ విసిరిన పలుకులు ములుకుల్లా తగిలి సుచరిత హృదయక్షేత్రాన్ని గాట్లు గాట్లు చేసాయి. ఇలాంటి సందర్భాలు తరచూ ఎదురవసాగాయి ఆమెకు.

ఎలాంటి శారీరక రోగం కాబోయే భర్తకి ఉండకూడదని భావించిందో అంతకంటే భయంకరమైన మానసిక జబ్బు 'అనుమాన రోగం' రోహిత్‌కి ఉందని ఆమె అనుభవాలు ఋజువు చేస్తుండడంతో నివ్వెరపోయింది.

అనుమానరోగం తగ్గడానికి మందుల్లేవు. నివారణకు మార్గాల్లేవు. నిర్మూలనకు చికిత్సల్లేవు. అయినా ఒక 'మొగుడు' అనుమానరోగం బారిన పడడమనేది అతడి చేతుల్లోనే ఉంది. తలరాత కాదది, తలకెక్కిన రాత, తలబిరుసు రాత, తలపుచ్చురాత. అంతే.

మేడిపండు చందంలాంటి రోహిత్ అంతర్గత రోగాన్ని ఎలా నయం చేయాలా, ఎలా సమూలంగా నాశనం చేయాలా అని సుచరిత మస్తిష్కం మరుగుతోందిపుడు వేనవేల సెంటీగ్రేడ్ డిగ్రీలుగా!

సుచరిత నేటి మహిళేకాదు. రేపటి ఆధునిక తరానికి సైతం ప్రతినిధి.

**"ముల్లుని ముల్లుతోనే తీయాలి. వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి. తేడాగా ఉన్న భర్తని సదరు భార్యే మార్చాలి. మార్చుకోవాలి. తీర్చిదిద్దుకోవాలి. ఆ ధైర్యసాహసాలకి మహిళ పూనుకోకపోతే ఏ వైవాహిక జీవితమైనా రంగులు కోల్పోయిన హరివిల్లవుతుంది. ఆనందపు జీవన దృశ్యం కాస్తా అపహాస్యమయమవుతుంది".** గీతిక స్వర వీచికలు పదే పదే సుచరిత గుండె పొరల్ని స్పృశించసాగాయి.

సుచరిత తన భర్తకు అన్ని విధాలా చెప్పిచూసింది. వీలైతే ఓసారి మానసిక వైద్యుడిని సంప్రదిద్దామని కోరింది. విన్లేదతను. కళ్ళెర్రచేసాడు.

తప్పనిసరై రోహిత్ మానసిక రోగం నయం చేయడానికి సుచరిత సరికొత్త చికాత్సా విధానానికి వ్యూహం పన్నింది. ఎవరూ ఊహించని విధంగా... ఏ మహిళయినా సరే అనుసరించే రీతిలో...

"మందుకావాలి!"

అనే హెడ్డింగ్‌తో ఒక పేపర్ ప్రకటన ఇచ్చింది.

"మా ఆయన జబ్బుతో బాధపడ్తున్నారు. శారీరక వ్యాధి అయితే మంచి డాక్టర్‌ని సంప్రదించేదానను. కానీ మా ఆయన అనుమాన రోగంతో సతమతమవుతున్నారు.

మనుధర్మశాస్త్రానుసారం మూడుముడులు వేసి, అగ్నిసాక్షిగా ఏడడుగులు వెంట నడిచి, ఏడేడు జన్మలదాకా నా తోడుంటానని పెళ్ళి మంత్రాలతో బాస చేసిన నా సగభాగం నన్నీరకమైన బాధకి గురిచేస్తోంది.

'గృహహింస' చట్టం కింద కేసు నమోదు చేయించి, నా వైవాహిక జీవితాన్ని

స్వయంగా నా చేతులారా విచ్ఛిన్నం చేసుకోవాలన్న తలంపు నాకేమాత్రం లేదు. అలా అని ఆయన్తో విడాకులు తీసుకొని విడిపోయే ఆలోచన కూడా లేదు. ఎందుకంటే మా ఆయనంటే నాకు ప్రాణం.

మరి మా ఆయన మానసిక జాడ్యానికేమైనా చికిత్స సూచించగలరా?

ప్లీజ్..."

ఆ పేపర్ ప్రకటన చూసిన రోహిత్ ఎంతలా కదిలిపోయాడంటే, అతడి అణువణువూ కంపించిపోయింది. సిగ్గుతో కుంచించుకుపోయాడు.

"నిజమే! తలచుకుంటే సుచరిత తనపై గృహహింస కేసు పెట్టొచ్చు. విడాకులు తీసుకునే స్వేచ్ఛా ఉంది. కానీ అలా చేయలేదు. తన ఉక్రోషాన్ని పేపర్ ప్రకటన ద్వారా వ్యక్తీకరించింది. అంతే! అంతే!" అని సరిపెట్టుకున్నాడు రోహిత్. పైగా వాస్తవం ఆలోచించసాగాడు.

'మా ఆయనంటే నాకు ప్రాణం' అనే వాక్యం అతని మనోఫలకాన్ని అలంకరించి అణువణువునీ మురిపింపచేసింది.

వర్షించడానికి పెనవేసుకుపోతున్న నల్లని మేఘవలయాల సమూహానికి ప్రతీకలా, ముభావంగా నిలబడి ఉన్న సుచరిత చెంతకి చేరాడు రోహిత్. ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకున్నాడు. భర్త కళ్ళలోకి చూసిందామె.

రోహిత్ కనుపాపల దర్పణాల నుండి 'క్షమించమనే' ప్రతిబింబం నిర్మలంగా ప్రసరిస్తూ... అతడి పెదాలవైపు చరించి ఆ పదానికి ప్రాణం పోయడానికి పెదాలు సమాయత్తమై కదలబోతుంటే... తన వేళ్ళ కొసలతో భర్త పెదాల్ని ఒప్పేసి ఆ ప్రయత్నాన్ని ఆపేసింది సుచరిత.

**"భార్యాభర్తల మధ్యన కలతల మడతల నలతలు సహజం. వాటిని విప్పుతూ, సరిచేసుకుంటూ సంసారాన్ని సరిదిద్దుకోవడంలోనే గొప్పతనముంది.**

మీ హృదయ స్పందనల మలిన రాహిత్యమే చెబుతోంది మీ మనోస్థితిని. అది చాలిక" ప్రేమగా తనని హత్తుకున్న భర్త చెవిలో గుసగుసలాడింది సుచరిత.

"అవును సుమా! ఏ ఒకట్రెండు జంటల విషయంలో మినహా వివాహబంధమనేది తొలినాళ్ళలో దాదాపుగా ఒడిదుడుకులతోనే మొదలవుతుంది. సామరస్యంగా చక్కదిద్దుకోవడంలోనే విజ్ఞత దాగి ఉంది." మనస్ఫూర్తిగా అంటూ భార్యని మరింత బలంగా తన కౌగిట బంధించాడతను.

హృదయఫలకాలను సరిదిద్దుకున్న ఆ భార్యాభర్తల బంధం మమతానురాగాలతో పెనవేసుకుపోయిందిపుడు... ఎప్పటికి కూడా!

(నవంబర్, 2009)

**పొట్టి కథల పోటీలో ఎంపికైన కథ**

*